సేవాలాల్ సేన రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేన రాష్ట్ర నూతన కమిటీని బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు నియమక పత్రాన్ని వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బానోతు హుస్సేన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకన్న నాయక్, ఉపాధ్యక్షులుగా జాటోత్ రవినాయక్, లకావత్ భాస్కర్‌నాయక్, రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా నరేష్ నాయక్, అధికార ప్రతినిధిగా సురేష్ నాయక్‌ను నియమించారు.

అంబేడ్కర్ లా కళాశాలకు న్యాక్ బీ++ గ్రేడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివంగత కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి స్థాపించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలకు న్యాక్ బీ++ గ్రేడ్ లభించిందని కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ వివేక్, సీఈఓ ప్రొ. లింబాద్రి తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలోని లా కళాశాలల్లో న్యాక్ బీ++ గ్రేడ్ సాధించిన ఏకైక కళాశాల తమదేనని పేర్కొన్నారు. ఇండియా టుడే సర్వేలో టాప్-5లో నిలిచిందన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బధిర ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు శుక్రవారం డెవ్ లప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి. భారతి, ఉపాధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, వాసుదేవరావ్, ఆంజనేయులు, మున్నిసా బేగం పాల్గొన్నారు.

సీవీఎల్‌కు మద్దిపట్ల పురస్కారం

చిక్కడపల్లి: జాంబాగ్ బాలానంద సంఘం వ్యవస్థాపకులు మద్దిపట్ల వెంకటరావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పగటి వేషగాళ్ల నాటకం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. బాలలే ఇందులో నటించి మెప్పించారు. త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో సీవీఎల్ నరసంహారావు దంపతులను సత్కరించి మద్దిపట్ల పురస్కారాం ప్రదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించండి

కవాడిగూడ: ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కల్వ నితీష్ కుమార్ ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా నేటికీ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు సర్దుబాటు కాలేదని విమర్శించారు. శుక్రవారం కవాడిగూడలోని చిత్రాలనగర్, దోమలగూడ ప్రభుత్వ పాఠశాలలో సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించి.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

చిక్కడపల్లి: మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా గాంధీనగర్‌కు చెందిన కోరంగి దుర్గారాణి నియమితులయ్యారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటకం నరసింగరావు ఆమెకు నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ.. బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలన్నారు. బీసీల సంఘటితం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆలోచనలతో ముందుకు సాగుతున్నామని అన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: గుర్తుతెలియని ఆగంతకులు ఆటో డ్రైవర్‌ను కొట్టి అతడి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు లాక్కెళ్లిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ బనావత్ సేవాలాల్ గురువారం రాత్రి లక్డీకాపూల్ వద్ద ఏడుగురిని తన ఆటోలో ఎక్కించుకున్నాడు. ఇద్దరు మధ్యలో దిగిపోగా 5 మంది జామై ఉస్మానియా స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ దిగి డబ్బులు ఇవ్వకుండా పట్టాలపైకి వెళ్లారు. డబ్బులు ఇవ్వాలంటూ వెళ్లిన ఆటో డ్రైవర్‌ను కొట్టి అతని వద్ద నుంచి రూ.3వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట -కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (30) పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘తెల్ల’కార్డుపై గంపెడాశలు!

- ఇప్పటి వరకు 2,700 కొత్త రేషన్‌కార్డుల జారీ
- కార్డులు రాని వారు ఎదురు చూపులు
- రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలి: దరఖాస్తుదారులు
- దరఖాస్తులకు చివరి తేదీ లేదు.. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు: ఏఎస్‌ఓ



సర్కిల్ 6 కార్యాలయంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి పథకానికి ప్రభుత్వం ఆధార్‌కార్డుతో పాటు రేషన్‌కార్డును కూడా ముడి పెట్టడంతో అనేక మంది రేషన్‌కార్డు లేని పేదలు ఆ కార్డు కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. గత 2, 3 నెలలుగా రేషన్ కార్డుల కోసం పేద ప్రజలంతా దరఖాస్తులు చేసుకుంటునే ఉన్నారు. కానీ దరఖాస్తు చేసుకున్న వారిలో కొద్ది మందికే రావడంతో తెల్లకార్డులు రానీ పేదలంతా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

◆ పౌర సరఫరాల శాఖ సర్కిల్-6 పరిధిలో ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 13,303 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో ఆడిషన్ కోసం 7,647 డిలిషన్ కోసం 4,963 దరఖాస్తులు వచ్చాయి. అందలో 4,458 దరఖాస్తుల విచారణ పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు 2,700ల కొత్త రేషన్ కార్డులను జారీ చేశారు. అయితే అనేక మంది పేద ప్రజలు అయ్యా ‘మాకు కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారు.?’అంటూ కార్యాలయం చుట్టూ తిరగడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన విచారణ చేపట్టి రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నారు.

దరఖాస్తులకు చివరి తేదీ లేదు....

◆ దశల వారీగా విచారణ చేపట్టి అందరికీ కార్డుల అందేలా కృషి చేస్తామని ఏఎస్ఓ దీప్తి తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఏమి లేదని ఎప్పుడైనా మీ సేవాలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.



పౌర సరఫరాల శాఖ సర్కిల్ 6 కార్యాలయం

ఏడు నెలలుగా ఎదురు చూపు



ఏడు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న ఇప్పటి వరకు మాకు కార్డు రాలేదు. ఇప్పటి వరకు ఎదురు చూస్తున్నాం. ఎప్పుడు వస్తాదో తెలియదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరిత గతినా కార్డులు ఇవ్వాలని కోరుతున్నాం. అనేక సార్లు కార్యాలయాలు చుట్టూ తిరిగాం.

– నరేష్, శ్రీరాంనగర్ బస్తీ

30 వరకు రేషన్ తీసుకోవాలి



ఈ నెల 30వ తేదీ వరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం తీసుకోవాలి. తరువాత రేషన్ బియ్యం ఇవ్వరు. మళ్లీ సెప్టెంబర్‌లోనే రేషన్ బియ్యం ఇస్తారు. జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి ఇస్తున్నాం.

– ఏఎస్‌ఓ దీప్తి

పుణ్యక్షేత్రాల టూర్ బస్ సర్వీస్ ప్రారంభం

కాచిగూడ: జంట నగరాల ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బర్కత్‌పుర డిపో ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజ్ బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం బర్కత్‌పుర డిపో వద్ద 5 పుణ్యక్షేత్రాలు ఒకరోజు టూర్ ప్యాకేజ్ బస్ సర్వీస్‌ను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. శ్రీరంగపురం, సోమశిల ప్రాజెక్టు, జోగులాంబ టెంపుల్, బీచ్‌పల్లి హనుమాన్ టెంపుల్, జూరాల ప్రాజెక్టుల సందర్శనకు డీలక్స్ బస్సును ఆర్టీసీ నడుపుతోందన్నారు. పెద్దలకు రూ.1450, పిల్లలకు రూ.1000 టికెట్ ధర నిర్ణయించారు. ఈ సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బర్కత్‌పుర డీఎం ఆర్.మంజులరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది మిథున, జయలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. టూర్ వెళ్లాలనుకునే వారు ఫోన్ నం.94920 25577, 90004 06069లో సంప్రదించాలని కోరారు.



బర్కత్‌పుర డిపో వద్ద బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఏఎస్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఐజాక్‌రాజ్



నల్లకుంట: అటల్ సేవా దళ్ (ఏఎస్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం. ఐజాక్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవా దళ్ వ్యవస్థాకుడు, జాతీయ అధ్యక్షుడు ఎస్.రఘునందన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినందుకు అటల్ సేవా దళ్ జాతీయ అధ్యక్షుడికి ఐజాక్ రాజ్ ధన్యవాదాలు తెలియజేశారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు పూర్తిచేయండి

అంబర్‌పేట: శ్మశానవాటికల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట మోయిన్‌చెరువు హిందూ శ్మశానవాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీ.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ బీజేపీ నేత ముత్యాలు మృతి



ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు, రంగానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు దండు ముత్యాలు(61) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, భోలక్పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నగర నాయకులు సీకే శంకర్‌రావు, చంద్రమోహన్, రంగానగర్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, ప్రవీణ్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపి ధైర్యం తెలిపారు. ముత్యాలు అంత్యక్రియలు బన్సీలాల్ పేటలో జరిగాయి.

భూ సమస్యలపై జిల్లా సదస్సులు నిర్వహించాలి



వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాపులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా జూలై 4న భూసమస్యలపై జిల్లా సదస్సులు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయక సంఘం ఆధ్వర్యంలో భూ సమస్యలపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దేవాదాయ చెరువు శిఖం తదితర అనేక రకాల మిగులు భూములు ఉన్నాయన్నారు. వీటన్నింటి పై ప్రత్యేకంగా సర్వేలు చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.నాగయ్య, నాయకులు ఆర్.వెంకట్‌రాములు, బి.ప్రసాద్, కె.నర్సింహ, ఎ.కనకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేసే వరకు టీబీ లక్షణాలు తెలుసుకోలేం

కాచిగూడ: టీబీ నిర్ధారణ పరీక్షలు చేసే వరకు ఈ వ్యాధి లక్షణాలు తెలుసుకోలేమని కింగ్‌కోఠి జిల్లా ఆస్పత్రి డాక్టర్ పల్లవి అన్నారు. కింగ్ కోఠి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం చెప్పల్‌బజార్, ఇందిరానగర్ బస్తీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక టీబీ విభాగం ఉందని.. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఇంటి వద్దకే మందులు అందిస్తామని డాక్టర్ పల్లవి తెలిపారు. తెమడ పరీక్ష ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారిస్తారని తెలిపారు. వ్యాధి ఉన్నవారికి ఆకలి, బరువు తగ్గడం, నీరసం, ఆయాసం, ఛాతిలో నొప్పి ఉంటుందన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన వారు ఆరు మాసాలు విధిగా మందులు వాడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలన్నారు. బలవర్ధకమైన ప్రొటీన్లుతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సాంఘిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఇంద్ర, సబిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రైల్లో ఆభరణాల చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు పుస్తెలు, వెండి వస్తువుల చేతి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం ప్రాంతానికి చెందిన సదానంద్ భార్య సుగుణ గురువారం విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నారు. రైలు ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద ఉండగా బ్యాగు చూసుకోగా రోల్‌గోల్డ్ గొలుసుకు వేసిన 10 గ్రాముల బంగారు పుస్తెలు, 90 గ్రాముల వెండి వస్తువులు కనబడలేదు. శుక్రవారం బాధితులరాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును ఖమ్మం రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.

దివ్యాంగుల్లోనే పట్టుదల ఎక్కువ

సాంస్కృతిక సారథి ఛైర్మన్ గుమ్మడి వెన్నెల



హెలెన్ కెల్లర్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న గుమ్మడి వెన్నెల

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగులు ఒంటరి వారు కాదని సకలాంగుల కంటే వికలాంగుల్లో పట్టుదల ఎక్కువగా ఉంటుందని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ గుమ్మడి వెన్నెల అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వికలాంగులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ... అంగవైకల్యం ఉందని బాధపడకుండా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్, రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, మెట్రోపాలిటన్ రిటైర్డ్ జడ్జి బాషా నావాజ్ ఖాన్, ఉమార్ ఖాన్, నాగేంద్ర, అనురాధ, వరమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ బహుభాషా కోవిదుడు

చిక్కడపల్లి: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు యాదిలో.. నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీవీ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడని కొనియాడారు. పీవీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని పేర్కొన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పీవీ గొప్ప రాజకీయ తాత్వికవేత్త అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు పీఎస్ఆర్ మూర్తి, రమాదేవి, లతా వర్మ తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావుకు నివాళులర్పిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

నూతన పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

చిక్కడపల్లి: సీవరేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని శుక్రవారం కాంట్రాక్టర్లకు సూచించారు. డివిజన్‌లోని అరుంధతినగర్‌లో చేపడుతున్న ఈ పనులను వాటర్ వార్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో కలసి ఆమె పరిశీలించారు. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీస్టీ రాజు, ఎం.ఉమేష్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అరుంధతినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

‘విలువలతో కూడిన విద్యే భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది’



పేరెంట్ ఓరియంటేషన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ ఏసీసీ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో 5వ తరగతి విద్యార్థుల పేరెంట్‌తో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్‌తో జ్యోతి ప్రజ్వాలన చేయించారు. అనంతరం ప్రిన్సిపల్ చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ... ఇల్లే ఒక ప్రయోగశాల అని ఉపాధ్యాయులతో పాటు వారు తల్లిదండ్రులు కూడా పిల్లలపై దృష్టిని సారిస్తే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పట్టుదలను ప్రాథమిక దశ నుంచే నేర్పించాలని సూచించారు. అందులో మనం అందరం భాగస్వాములు కావాలన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌నగర్ బస్తీవాసులకు ఇళ్లు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లిలోని శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత అవుల లోకేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణికి వినతి పత్రం సమర్పించారు. మూడు దశాబ్దాలుగా ఇక్కడే జీవనం సాగిస్తున్న వీరికి వెంటనే ‘డబుల్’ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బస్తీవాసులు కళావతి, నర్సామణి. మల్లీశ్వరి, జయమ్మ, లక్ష్మి, అనంతమ్మ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి సమర్పిస్తున్న ఆవుల లోకేష్‌యాదవ్

యుగేందర్‌గౌడ్‌పై దాడిని ఖండిస్తున్నాం



చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా కొత్తకోట కేంద్రంగా నిత్యం ప్రజా సమస్యలపై యుగేందర్‌గౌడ్ అనేక పోరాటాలు చేస్తున్నారని అన్నారు. గురువారం అర్ధరాత్రి ఆయనపై జరిగిన అమానుషంగా దాడి చేశారన్నారు.ఈ దాడిని పిరికిపందాల చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగొని బాలరాజ్‌గౌడ్, గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, నాయకులు బైరు శేఖర్, నాగేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు అభినందన సత్కారం

చిక్కడపల్లి: రచయిత, నటుడు, లఘు డ్యాకుమెంటరీ నిర్మాత డాక్టర్ కె.ధర్మారావు అభినందన సత్కార కార్యక్రమం శుక్రవారం త్యాగరాయ గానసభలో మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు హాజరై మాట్లాడారు. దేశ విదేశాల్లో మన తెలుగు కళలు ఉట్టిపడేలా కార్యక్రమాలను ధర్మారావు నిర్వహించారన్నారు. వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు తానా డెట్రాయిట్ సభల్లో పాల్గొనే ధర్మారావును సత్కరించి తెలుగు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు మరంత పెద్ద ఎత్తున జరిగేందుకు కృషి చేసినట్లయ్యిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌కుమార్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.



లఘు డ్యాకుమెంటరీ నిర్మాత డా. ధర్మారావును సత్కరిస్తున్న మధుసూదనాచారి, కృష్ణమోహన్

జగన్నాథ రథయాత్ర.. భక్తజన శరణుఘోష

- కనులపండువగా జగన్నాథుడి రథయాత్ర
- రోడ్లను ఊడ్చి ముగ్గులు వేసిన మహిళా భక్తులు
- జగన్నాథుడి రథ చక్రాలకు స్వాగతం పలికిన ముగ్గులు
- భక్తులతో కలిసి రథాన్ని లాగిన ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



రోడ్డును శుభ్రం చేస్తున్న అనిల్‌కుమార్, అద్దంకి దయాకర్



రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

కవాడిగూడ: అబిడ్స్ ఇస్కాన్ ఆలయ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీజగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద జగనాథుడికి ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. 46 ఏళ్లుగా జగనాథుడి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ వరద కృష్ణదాస్, రథయాత్ర సందర్భంగా ఎన్‌టీఆర్ స్టేడియం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్డును శుభ్రం చేసి రంగురంగుల ముగ్గుల వేశారు. రథయాత్ర ముందుకు సాగే దారిలో అడుగడుగునా రోడ్డును శుభ్రం చేసి భక్తులు ముగ్గులు వేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులు, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు సీతారాందాస్ ప్రభు, కో-ఆర్డినేటర్ శంభువైష్ణవ దాస్, విష్ణుప్రసాద్ ప్రభు హనుమాన్ విజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అతిథులతో ఆలయ అర్చకులు గుమ్మడి కాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు.

రథాన్ని లాగిన ఎంపీ అనిల్‌కుమర్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్..

ఈ సందర్భంగా రథం ముందు చీపుర్లుతో ఊడ్చి అనంతరం ఎంపీ అనిల్‌కుమర్ యాదవ్, అద్దంకి దయాకర్ రథాన్ని లాగారు. అనంతరం భక్తులు రెండు వైపులా తాళ్లతో రథాన్ని ముందుకు లాగారు. ఈ సందర్భంగా హరే రామ హరే కృష్ణ నామస్మరణతో ఎన్‌టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఎన్‌టీఆర్ స్టేడియం ఇందిరాపార్కు చౌరస్తా, అశోక్ నగర్ చౌరస్తా, జవహర్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్ మీదుగా నారాయణగూడ, హిమాయత్ నగర్ లిబర్టీ, బషీర్‌బాగ్ వైపు ముందుకు సాగింది. రథయాత్రకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు రథం పొడవునా భారీ బందోబస్తు నిర్వహించారు.